చలి వేళ..చన్నీళ్లే గతి..!

- ఆశ్రమ పాఠశాలలో పని చేయని సోలార్ హీటర్ పరికరాలు
- పట్టించుకోని అధికారులు, ఇబ్బందుల్లో గిరిజన విద్యార్థులు

నార్నూర్ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలికల పాఠశాలలో నిరుపయోగంగా సోలార్ హీటర్ పరికరాలు

నార్నూర్, డిసెంబర్ 8 : పక్షం రోజుల నుంచి చలి తీవ్రత పెరుగుతున్నది. చన్నీళ్ల స్నానమంటే వణుకు పుడుతుంది. చలికాలంలో ఎక్కువ మంది ఆరోగ్యరీత్యా వేడినీళ్లతో స్నానం చేస్తుంటారు. ముఖ్యంగా పిల్లలు కూడా వేడినీళ్లకే ప్రాధాన్యం ఇస్తారు. నార్నూర్, గాదిగూడ మండలాల్లోని గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలబాలికల, శాటిలైట్ పాఠశాలలో విద్యార్థులు ప్రతిరోజూ గజగజ వణికించే చలిలో చన్నీటితో స్నానాలు చేస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలికి తోడు వీస్తున్న చల్లని ఈదురు గాలులు, పొగమంచు కారణంగా ఇప్పటికే కొందరు విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. జలుబు, దగ్గు తీవ్రతకు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తున్నది. సోలార్‌హీటర్ ఉన్నా.. చెడిపోయి సంవత్సరాలు గడుస్తున్న పట్టించుకోకపోవడంతో విద్యార్థులకు శాపంగా మారింది. పడిపోతున్న ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న విద్యార్థులు ప్రతి రోజూ ఉదయం వణికిస్తున్న చలిలో చల్లటినీటితో స్నానం చేసేందుకు జంకుతున్నారు. తప్పని పరిస్థితుల్లో చల్లటి నీటితో స్నానం చేస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాం కుల్లో నిల్వ ఉన్న చల్లటి నీరే తమకు అంటూ వాపోతున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ ఉన్నతాధికారులు చొరవ తీసుకొని సోలార్ వాటర్ హీటర్లను బాగు చేయించాలని విద్యార్థినులు వేడుకుంటున్నారు.

జలుబు, దగ్గుతో బాధపడుతున్నాం..

ప్రతి రోజూ చల్లటి నీటితో స్నానం చేయడంతో చాలా మంది జలుబు, దగ్గుతో బాధపడుతున్నారు. వేడినీళ్ల కోసం సార్ దృష్టికి తీసుకొచ్చాం. చలికాలంలో చల్లటి నీటితో స్నానం చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. పెద్దసార్లు చొరవ తీసుకొని వేడినీళ్లు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

-భూమిక, పదో తరగతి విద్యార్థిని

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం...

సోలార్ హీటర్ పరికరాలు చెడిపోయి చాలా రోజులైన విషయం వాస్తవమే. చల్లటి నీటితో విద్యార్థులు స్నానం చేయాల్సి వస్తుంది. చాలా సార్లు సంబంధిత శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-జాదవ్ విఠల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, నార్నూర్

కార్మికుల హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉండాలి

ఎదులాపురం, డిసెంబర్ 8 : కార్మికుల హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉంటూ ప్రభుత్వంపై ఉద్యమించాలని విశ్రాంత కార్మిక శాఖ అధికారి జగదీశ్ రెడ్డి అన్నారు. కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఆదిలాబాద్‌లోని అంబేద్కర్‌చౌక్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సంక్షేమ పథకాలు పెంచే వరకు ఉద్యమిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆయా దుకాణాల్లో పని చేసే కార్మికులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు రూ.10 వేలు అందజేత

జైనథ్, డిసెంబర్ 8 : జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పని చేస్తున్న ఆయా తుమ్మల కళాబాయి ఆదివారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సీడీపీవో సురేఖ ఆదేశాల మేరకు అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేల నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. ఇక్కడ ఐసీడీఎస్ అధికారులు శివరామ కృష్ణ, సూపర్‌వైజర్ ముంతాజ్ బేగం, అనిల్ కుమార్, గ్రామ పెద్దలు తిరుపతి, గంగారాం, రాములు, స్వామి, అంగన్‌వాడీ టీచర్లు దేవమ్మ, మణిమాల, మమత ఉన్నారు.

కొనసాగుతున్న స్మృతివనం ఏర్పాటు పనులు

ఇంద్రవెల్లి, డిసెంబర్ 8: ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద స్మృతివనం ఏర్పాటు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అమరవీరుల స్తూపానికి చెందిన స్థలానికి చుట్టు గోడతో పాటు నాలుగు దిక్కుల ప్రత్యేకంగా గ్రీనరి, దారుల ఏర్పాట్ల పనులు చేపడుతున్నారు. ఇప్పటికే స్తూపం వద్ద నాలుగు దిక్కులకు దారులతో పాటు ముఖద్వారానికి మెయిన్ గేట్లను ఏర్పాటు చేశారు. దీంతో అమరవీరుల స్తూపం మరింత అందాన్ని సందరించుకోనున్నదని ఆదివాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 8 : బీసీ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులకు తక్షణమే దుప్పట్లు పంపిణీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం వెంటనే దుప్పట్లు పంపిణీ చేయాలన్నారు.

కాల భైరవస్వామి ఆలయానికి విరాళం

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 8: నిర్మల్‌లోని కాలభైరవ స్వామి ఆలయానికి స్థానిక గుంజాల లక్ష్మి శంకర్ దంపతులు ఆదివారం రూ. 51వేలు విరాళం అందజేశారు. అనంతరం కాలభైరవ అష్టమి పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వాములు మాట్లాడుతూ ఆలయానికి గేటు, జాలీలు నిర్మిస్తామని తెలిపారు.

10న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

భైంసా, డిసెంబర్ 8 : భైంసాలోని బృందావన్ గార్డెన్‌లో స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్‌స్ట్రక్షన్, లయన్స్ క్లబ్ ఆఫ్ భైంసా డైమండ్, దివ్యాంగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు స్నేహ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ మహిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో దివ్యాంగులచే సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్, డాక్టర్ దామోదర్ రెడ్డి, డాక్టర్ కాశీనాథ్ హాజరుకానున్నారని పేర్కొన్నారు.

రిజర్వేషన్‌పై అసెంబ్లీలో ప్రస్తావించాలి

ఉట్నూర్, డిసెంబర్ 8 : ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌ను ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ జాదవ్ సుమేశ్, గోండువాన సమితి జేఏసీ సత్యనారాయణ, ప్రకాశ్‌దొర, ఎస్టీ సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాజేశ్‌నాయక్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశంలో ప్రత్యేక ట్రైబల్ అడ్వైజర్ కమిటీ ఏర్పాటుతో పాటు ఏజెన్సీలో వందశాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

గిరిజన గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరం

కడెం, డిసెంబర్ 8 : కన్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గొండుగూడెం, కొలంగూడ గ్రామాల్లో నిర్మల్‌కు చెందిన కావేరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం రెండు గ్రామాలకు చెందిన 69 కుటుంబాలకు స్వేటర్లు, దుప్పట్లు పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ కోశాధికారి అప్పాల శశికళ తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తుమ్మల దేవరావ్, అంబటి నారాయణ, మైస రవీందర్, దీపక్‌రెడ్డి, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి భూమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువకుడికి సన్మానం

నేరడిగొండ, డిసెంబర్ 8 : మండల కేంద్రానికి చెందిన పవన్ ఇటీవల ప్రభుత్వ కొలువు సాధించడంతో పద్మశాలీ సంఘం సభ్యులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఆడెపు రమేశ్, శేఖర్, నర్సయ్య, రంజిత్, సాగర్ తదితరులు పాల్గొన్నారు

భక్తులతో కిటకిటలాడిన కైలాస్‌టెకిడి

కైలాస్ టెకిడిలో దర్శనానికి బారులు తీరిన భక్తులు

బోథ్, డిసెంబర్ 8: బోథ్ మండలం నిగిని గ్రామ పంచాయతీ పరిధిలోని కైలాస్‌టెకిడిలోని నర్మదేశ్వర ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా బోథ్, నిర్మల్, ఆదిలాబాద్, కిన్వట్, బోకర్, కుభీర్, నాందేడ్, ఇస్లాపూర్, తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. నర్మదేశ్వరుడిని దర్శించుకునేందుకు క్యూలో నిలబడ్డారు. లింబాజీ మహారాజ్ ఆధ్వర్యంలో మండల పూజ, రుద్రాభిషేకం, యంత్ర స్థాపన హారతి, దీపారాధన, లక్ష్మణ శక్తి పారాయణ పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి

ఎదులాపురం, డిసెంబర్ 8 : ప్రజలకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణి శంకర్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పట్టణ విస్తృత కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ నెల 26న నిర్వహించే పార్టీ వంద సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గ్రామగ్రామాన నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణి శంకర్, జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు విలాస్, ముడుపు నళిని రెడ్డి. నాయకులు దేవేందర్, అరుణ్ కుమార్, కట్ట కిష్టయ్య పాల్గొన్నారు.

అధికారులకు వినియోగదారులు సహకరించాలి

దస్తురాబాద్, డిసెంబర్ 8: విద్యుత్ బిల్లుల కోసం వచ్చిన అధికారులకు వినియోగదారులు సహకరించి సకాలంలో చెల్లించాలని ఏఈ శ్రీనివాస్ కోరారు. మండలంలోని బుట్టాపూర్ గ్రామంలో ఆదివారం ప్రజలు ,రైతులకు విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వాడకంలో రైతులు, వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సొంతంగా ఎవరు కూడా పనులు చేయవద్దని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అనుమానితుల పేర్లను నమోదు చేసుకోవాలి

సర్వేను పరిశీలిస్తున్న జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ గజానంద్

ఎదులాపురం, డిసెంబర్ 8 : కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే కొనసాగుతుందని అనుమానితుల పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ గజానంద్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని పలు కాలనీల్లో కొనసాగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వేలో భాగంగా కుటుంబ సభ్యులందరిని తప్పనిసరిగా పరీక్షించాలని సూచించారు. అనుమానితులను తమ పరిధిలోని యూపీహెచ్‌సీలు, పీహెచ్‌సీలకు రెఫర్ చేయాలన్నారు. ఇంటి వచ్చే ఆశ కార్యకర్తలకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ అధికారులు వామన్ రావ్, రమేశ్, సీహోలు రణిత, నవీన్, ఏఎన్ ఎంలు హరిత, లత, ఆశ కార్యకర్తలు అర్చన, లక్ష్మి, స్వరూప పాల్గొన్నారు.

డోప్టాలలో దొంగతనం

బేల, డిసెంబర్ 8: బేల మండలం డోప్టాల గ్రామంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆదివారం పట్టపగలు దొంగలు చొరబడి 3 తులాల బంగారం, రూ.35 వేల నగదు, 10 తులాల వెండి అపహరించారు. బాధితుడు కుంచల విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దివ్యభారతి తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

చిన్న భూమన్న

నర్సాపూర్ (జీ), డిసెంబర్ 8 : నర్సాపూర్ (జీ) మండలం కుస్లి గ్రామానికి చెందిన చాకటి చిన్న భూమన్న (50) అదృశ్యమయ్యాడు. భూమన్న గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు బంధువుల ఇళ్లలో చుట్టు పక్కల నాలుగు రోజులు వెతికిన ఆచూకీ దొరకలేదు. భూమన్న భార్య చాకటి భారతి ఫిర్యాదు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

చిన్నారికి అండగా నిలిచిన సమతా ఫౌండేషన్

మాట్లాడుతున్న సమతా ఫౌండేషన్ చైర్మన్ సమతా సుదర్శన్

నర్సాపూర్(జీ), డిసెంబర్ 8 : నర్సాపూర్(జీ) మండలం చెర్లపల్లి గ్రామానికి చెందిన రితిక(7) ఇటీవల తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మిగిలిపోయింది. గ్రామస్తులు సమతా ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ సమాచారం అందజేశారు. స్పందించిన సుదర్శన్ రితికకు అన్ని విధాలుగా సమత ఫౌండేషన్ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సాహెబ్ రావు, అనిల్, యోగేశ్, రాజు, ప్రవీణ్, వెంకటేశ్ గౌడ్, చంద్రయ్య పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగుతున్న పోటీలు

ఎదులాపురం, డిసెంబర్ 8 : సీఎం కప్ 2024 మండల స్థాయి క్రీడా పోటీలు రెండో రోజు ఆదివారం కొనసాగాయి. ఆదిలాబాద్ రూరల్‌లోని యాపల్ గూడ, బోథ్ మండలం మర్లపల్లితో పాటు పలు గ్రామాల్లో నిర్వహించిన సీఎం కప్ క్రీడాపోటీలను డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ఎదులాపురం: ఆదిలాబాద్‌లో సహపంక్తి భోజనాలు చేసి నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

ఎదులాపురం, డిసెంబర్ 8 : సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనే లక్ష్యంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపడుతున్న ఆందోళనలో భాగంగా ఆదివారం ఆదిలాబాద్‌లోని ఎన్టీఆర్ చౌక్‌లో నిరసన తెలిపారు. సడక్ పే ఖానా..రెగ్యులర్ హోనా అన్న నినాదంతో రహదారిపై సహపంక్తి భోజనాలు చేసి వినూత్న నిరసన తెలిపారు. వీరి నిరసనకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి మద్దతు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చేసే వరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్, పార్థసారథి, దేవదర్శన్, ప్రకాశ్, రాజన్న, శ్రీకాంత్, భోజన్న పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట దీక్ష

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 8 : తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఆదివారం నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట సమశిక్షా అభియాన్ ఉద్యోగులు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐదు రోజుల నుంచి దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రభుత్వం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఎనికైన కార్యవర్గ సభ్యులకు పత్రాలు అందజేస్తున్న టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అశోక్

ఎదులాపురం, డిసెంబర్ 8 : వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఉమ్మడి జిల్లా ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఆదిలాబాద్‌లోని సెంట్రల్ గార్డెన్‌లో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అశోక్ వ్యవహరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా సయ్యద్ అజామలీ, కార్యదర్శిగా పీ రామకృష్ణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా శ్రీకాంత్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా కే రాజేశ్వర్, జే స్వామి, జాయింట్ సెక్రటరీలుగా షైక్ ఒసామా , కే మాధవ్, అస్మ సుల్తానా, ట్రెజరర్‌గా ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్, పబ్లిసిటీ సెక్రటరీగా ఎస్ శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వీ మనోజ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా ఎన్ ప్రకాశ్, ఎండీ రషీద్ , రైసఖాతున్, అడ్వైజర్‌గా అన్నెల అడెల్లును ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం 2024 నుంచి 2027 వరకు ఉంటుంది. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వారికి నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. మార్కెటింగ్ కమిటీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, రాష్ట్ర నాయకుడు తిరుమల్ రెడ్డి, తాలూకా కార్యదర్శి అరుణ్ కుమార్, ఉమ్మడి జిల్లా ఉద్యోగులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తానూర్: సమావేశమైన 2008-09 బ్యాచ్ విద్యార్థులు

తానూర్, డిసెంబర్ 8 : నిర్మల్ జిల్లా తానూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-2009 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నరేందర్, ఉపాధ్యాయులు నర్సింగ్‌రావు, నర్సయ్య, సురేఖ, సురేశ్ పవార్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు

ఉట్నూర్, డిసెంబర్ 8 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1993-94లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సాంబన్న, చిన్నయ్య, శ్రీధర్, రాజానర్సింహులు, ఆదిల్, అజీమ్, దేవీదాస్, సరిత, రజిని, అనిత పాల్గొన్నారు.

ఉట్నూర్: ఉపాధ్యాయులతో విద్యార్థులు

విద్యార్థులకు కరాటే గ్రేడింగ్ బెల్టులు ప్రదానం



విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 8 : నిర్మల్‌లోని వాసవి వరల్డ్ స్కూల్‌లో జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు.ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన 60 మంది విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జపాన్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్టేట్ చీఫ్ ఎగ్జామినర్ తేజేందర్‌సింగ్ బాటియా, జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, వాసవి వరల్డ్ స్కూల్ కరస్పాండెంట్ జగదీశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శైలజాయ్సన్, కరాటే శిక్షకురాలు కిన్నెర మృణాళిని, అసోసియేషన్ సభ్యులు అమ్ముల భూషణ్, స్వామి, జ్ఞానతేజ, అజయ్ నాయక్ పాల్గొన్నారు.

ఉద్యమ దినోత్సవం సభను ఘనంగా నిర్వహించుకోవాలి



సభ నిర్వహణపై చర్చిస్తున్న ఆదివాసీ పెద్దలు

ఇంద్రవెల్లి, డిసెంబర్ 8: ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద సోమవారం నిర్వహించే ఆదివాసీ హక్కుల ఉద్యమ దినోత్సవం సభను ఘనంగా నిర్వహించుకోవాలని ఆదివాసీ గిరిజన పెద్దలు మెస్రం వెంకట్ రావ్‌పటేల్, సిడాం భీంరావ్ పిలుపునిచ్చారు. ఆదివారం అమరవీరుల స్తూపం వద్ద రాయి సెంటర్, తుడుందెబ్బ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆదివాసీ పెద్దలు మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల ఉద్యమ దినోత్సవ సభకు ఆదివాసీ గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన నాయకులు, తుడుందెబ్బ నాయకులు కనక తుకారాం, ఆర్కా ఖమ్ము, పుర్కా బాపురావ్, కోట్నాక్ బారిక్‌రావ్, మెస్రం నాగ్‌నాథ్, పుర్కా చిత్రు, జుగ్నాక్ భరత్, మెస్రం శేఖర్‌బాబు, పృథ్వీరాజ్, సాగర్, రాందాస్, ఉత్తమ్, భీంరావ్, ఆత్రం అశోక్, వినోద్ పాల్గొన్నారు.

'చలో ఇంద్రవెల్లి' విజయవంతం చేయాలి

ఉట్నూర్, డిసెంబర్ 8 : చలో ఇంద్రవెల్లి సభకు ఆదివాసులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గుపటేల్, ఉట్నూర్ మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్, ప్రధాన కార్యదర్శి పుర్కా బాపురావ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ హక్కులతో పాటు ఆదివాసీ అస్తిత్వాన్ని కాపాడేందుకు సోమవారం సభలు నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీ గూడేల్లో ఆదివాసీ జెండాను ఆవిష్కరించాలన్నారు. తొమ్మిది తెగల ఆదివాసీలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సలాం శ్యాంరావ్, సిడాం సోనేరావ్, నాగోరావ్, మారుతి పాల్గొన్నారు.

ఇరువు వర్గాలపై కేసు నమోదు

ఎదులాపురం, డిసెంబర్ 8: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని 68 సర్వే నంబర్‌లో కొన్ని ప్లాట్ల విషయంలో ఇరు వర్గాలపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ముజాహిద్ తెలిపారు. 68 సర్వే నంబర్‌లో కొన్ని ప్లాట్లు తమవే అంటూ ఓ వర్గం వారు, మరో వర్గం వారు ఆందోళనకు దిగారు. ఈ విషయం రూరల్ పోలీసులకు సమాచారం రావడంతో ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాహనాల తనిఖీ

నర్సాపూర్ (జీ). డిసెంబర్ 8 : నర్సాపూర్(జీ) మండలం తిమ్మాపూర్ వద్ద ఎస్ఐ హన్మాండ్లు ఆధ్వర్యంలో ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. వాహన దారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహన పత్రాలు కలిగి ఉండాలని అన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార అలవాట్లలో మార్పులు చేసుకుంటే ఆరోగ్యంగా ఉంటాం

ఎదులాపురం, డిసెంబర్ 8 : ఆరోగ్య అలవాట్లను సక్రమంగా పాటిస్తే ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులు రావని, వయోవృద్ధులు దానిని అనుసరించాలని జిల్లా సంక్షేమాధికారి సబిత అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని శాంతినగర్‌కు చెందిన చిల్వేరి నర్సుబాయి(99) ఇంటిని వయోవృద్ధుల సమాఖ్య ఆధ్వర్యంలో సందర్శించారు. వృద్ధురాలి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంక్షేమ అధికారిణి ఆమెను శాలువాతో సన్మానించారు. 99 ఏండ్ల వయస్సులో కూడా బీపీ, షుగర్ లేకుండా నర్సుబాయి ఉన్నారన్నారు. ఆమె రోజు తీసుకునే ఆహారంతోనే సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ ఆహార అలవాట్లలో మార్పులు చేసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్వో పోశెట్టి, సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ దేవీదాస్‌పాండే, కార్యదర్శి రాంకులకర్ణి, సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వాహనాలు బస్టాండ్‌లోకి రాకుండా చూడాలి

ఇచ్చోడ, డిసెంబర్ 8: